## క్లుప్తంగా

### గెలిపించండి... స్థానికంగా ఉండి సేవ చేస్తా

- వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి టీఎన్ దీపిక

**హిందూపురం:** ఒక్కసారి తనకు ఎమ్మెల్యే అవకాశం ఇస్తే నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక తెలిపారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పురం ప్రజలు ఇన్నాళ్లు ఓకే పార్టీని గెలిపిస్తూ వచ్చారని, స్థానికేతరులను గెలిపించి వారి కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు స్థానికంగా ఉంటూ మీ ఇంటి ఆడపడుచుగా అభ్యర్థిస్తున్నానని, ఒకసారి గెలిపించండి ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అవుతుంది. ఎండలు ఎక్కువ కాకముందే త్వరగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హిందూపురం అభివృద్ధికి పునాదులు వేయడానికి అందివచ్చిన అవకాశాన్ని హిందూపురం నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే హిందూపురం రూపురేఖలు మారతాయన్నారు.

### లేపాక్షిని సందర్శించిన కర్ణాటక న్యాయమూర్తి



జడ్జి బసవరాజుకు పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

**లేపాక్షి:** లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆదివారం ఉదయం కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ బసవరాజుతో పాటు వారి కుటుంబ సభ్యులు సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు.

### ఘనంగా శంకరాచార్యుల జయంతి



శంకరాచార్యుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

**పావగడ:** హిందూ ధర్మాన్ని పరిరక్షించిన ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తాలూకా కార్యాలయంలో ఆర్ఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరాచార్యుల చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక బ్రాహ్మణ సంఘం నాయకులు సుబ్బనరసింహ, విశ్వనాథ్, లాయర్ జయసింహా, అనంతరాంభట్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్లను ప్రకటించిన అధికారులు

**హిందూపురం టౌన్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం పోలింగ్ జరగనుండగా అసెంబ్లీ నియోజకవర్గ సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి అధికారికంగా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఫైనల్ ఓటర్స్–2024ను ప్రకటించారు. హిందూపురం నియోజకవర్గ ఓటర్లు 2,49,174 కాగా అందులో పురుషులు 1,24,730 ఉన్నారు. అలాగే స్త్రీలు 1,24,425, ట్రాన్స్‌జెండర్ 19 మంది ఉన్నారు.

### ముగిసిన క్రికెట్ పోటీలు



క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

**హిందూపురం టౌన్:** పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ సారథ్యంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓ గంగప్ప, లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో రాహిబ్, ఫైసల్ ఖాన్ జట్లు తలపడగా, ఫైసల్ ఖాన్ జట్టు విజయం సాధించింది. రన్నర్‌గా రాహిబ్ జట్టు నిలిచింది. వీరికి మెమొంటోలను అందజేసి, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో చైతన్య గంగిరెడ్డి, ఉబేదుల్లా, పైల్వాన్ ఫయాజ్, దాదు, అబ్దుర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ బాసట... గెలుపు బావుటా !

- 'పురం'లో బాలయ్యకు షాక్ తప్పదంటున్న విశ్లేషకులు
- 'మడకశిర'లో ఉపాధి కూలి ఈరలక్కప్ప వైపే జనం !
- ఇరువురికి కలసిరానున్న 'స్థానికత'



దీపిక







**హిందూపురం:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా హిందూపురం నియోజకవర్గంలో టీడీపీకి షాక్ తగిలిలే దిశగా అడుగులు పడుతున్నాయి. గత 40 ఏళ్లగా టీడీపీకే పట్టం కడుతూ వచ్చిన పురం ప్రజలు ఈసారి మార్పు కోరుకుంటున్నట్లు స్పష్టం అవుతోంది.

**40 ఏళ్లగా పట్టంకట్టినా ఏం చేశారు?**

ఎప్పుడూ టీడీపీకే పట్టం కడుతూ వస్తున్నా నియోజకవర్గ అభివృద్ధికి వాళ్లు చేసింది శూన్యమని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఏళ్లగా టీడీపీ గెలుస్తూ వచ్చినా నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధికి బాటలు వేయలేకపోయారని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే పురం ప్రజలపై ఎనలేని ప్రేమను కురిపిస్తూ తర్వాత ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై మండిపడుతున్నారు. 1985–94 వరకూ ఎన్టీ రామారావు తర్వాత 1996 ఉప ఎన్నికల్లో హరికృష్ణ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయినా హిందూపురం నియోజకవర్గం మాత్రం ఎలాంటి మార్పు, అభివృద్ధి నోచుకోలేదు. 2014–22 వరకూ రెండు సార్లు బాలకృష్ణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మళ్లీ మూడోసారి ఇప్పుడు రంగంలో దిగారు. ప్రతిసారి మాదిరిగా ప్రజలు టీడీపీని గుడ్డిగా గెలిపిస్తారని తమ్ముళ్లు భావిస్తున్నా ఈసారి మాత్రం జనం షాక్ ఇవ్వడానికే సిద్ధమయ్యారని అంటున్నారు. నందమూరి కుటుంబ సభ్యులు హిందూపురాన్ని తమ రాజకీయ మనుగడకు మెట్టుగా వాడుకుంటున్నారే హిందూపురాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి తమ కుటుంబాన్ని గుర్తుపెట్టుకునే మాత్రం చేయడం లేదన్న అపవాదు మూటగట్టుకున్నారు.

**హిందూపురంలో ఓటర్ల వివరాలు**

| మండలం | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్‌జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| హిందూపురం రూరల్ | 21,163 | 21,059 | 2 | 42,224 |
| హిందూపురం అర్బన్ | 64,467 | 64,545 | 14 | 1,29,026 |
| లేపాక్షి | 18,222 | 17,944 | 1 | 36,167 |
| చిలమత్తూరు | 20,878 | 20,877 | 2 | 41,757 |
| మొత్తం ఓటర్లు | 1,24,730 | 1,24425 | 19 | 249174 |

**అభివృద్ధికి హామీ..**

ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 'పురం' అభివృద్ధి తమ బాధ్యతంటూ హామీ ఇవ్వడంతో ఓటర్లు కూడా మార్పు కోరుకుంటున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. జిల్లా కేంద్రానికి ధీటుగా హిందూపురాన్ని విద్య, వైద్యరంగానికి హబ్ చేస్తామని చెప్పడంతో జనం సంక్షేమాభివృద్ధికే జై కొడుతున్నారని అంటున్నారు. నియోజకవర్గంలో ఇప్పుడు ఎవరి నోట విన్నా ఒక్క అవకాశం ఇద్దామనే మాటలే వినిపిస్తున్నాయి.

**ఎమ్మెల్యే బాలకృష్ణతో విసిగి పోయిన జనం**

టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ హైదరాబాద్‌లోనే ఉంటారు. ఎప్పుడో చుట్టపు చూపుగా అలా వచ్చి ఇలా వెళ్తుంటారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న రెండుసార్లూ ఆయన పీఏలదే ఇక్కడ పెత్తనం సాగింది. ఏడాదిలో ఒకటి, రెండుసార్లు ఎమ్మెల్యే బాలకృష్ణ రావడం.. రోడ్‌షోలు చేయడం చేతులూపి వెళ్లిపోవడం తప్ప చేసిదేమిలేదని స్థానికులు నిప్పులు చెరుగుతున్నారు. పాలన పీఏలకు వదిలేసి సినిమాలు చేసుకుంటూ డైలాగులు చెప్పే ఎమ్మెల్యే ప్రజలకు ఏమి చేయగలరని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దరిచేరి సేవలు చేయరు దగ్గరకెళితే కొడతారు.. ఇలాగైతే ఏలా అని ఎన్‌టీ రామారావు సతీమణి లక్ష్మీపార్వతి కూడా అన్నారు. తండ్రి ఉన్నప్పుడు చివరి రోజుల్లో తండ్రి పక్కన నిలవకుండా బావ పంచన చేరిన బాలకృష్ణకు ఎన్‌టీఆర్ అభిమానులు బుద్ధిచెప్పాలని గట్టిగా చెప్పారు. దీంతో ఈసారి అభిమానానికి, నాటి సంప్రదాయానికి తెర పడనుందనే మెజార్టీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**దీపిక లోకల్ ..**

ఉన్నత చదువులు చదువుకున్న వైఎస్సార్‌సీపీ టీఎన్ దీపికకు స్థానికత అంశం కలసిరానుంది. దీపిక మృదు స్వభావి. అందరితో కలుపుకోరు ఉంటున్న ఆమె వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన ఇంటి తలుపు తడితే చాలు అండగా ఉంటానంటూ దీపిక పదే పదే ప్రచారంలో చెప్పడం ఆమెకు కలిసివస్తోందని చెబుతున్నారు.

**సంక్షేమాభివృద్ధి వైపే జనం మొగ్గు**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సదుపాయలు, ప్రతి కుటుంబానికి కల్పించిన ఆర్థిక భరోసాతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా డీబీటీ, నాన్ డీబీటీ కింద నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.వేల కోట్లను వేశారు. హిందూపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలోనూ రోడ్లు, డ్రైనేజీలు, నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధి, పార్కుల సుందరీకరణ తదితర అభివృద్ధి పనులకు కూడా రూ.కోట్ల రూపాయలను వెచ్చించారు.

**మడకశిర:** మడకశిర నియోజకవర్గంలో 'ఫ్యాన్' గాలి జోరుగా వీస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప గెలుపునకు బాట వేస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు స్థానికుడు కాకపోవడం... ఆయనపై ఏకంగా 54 వరకూ కేసులు ఉండటం కూడా ఈరలక్కప్పకు కలిస్తోంది. స్థానికుడైతే అన్ని వేళలా అందుబాటులో ఉంటాడని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారు.

**2.41 లక్షల మందికి లబ్ధి**

గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. మడకశిర నియోజకవర్గంలో ఎక్కువగా పేద ప్రజలు ఉన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా సంక్షేమ పథకాల ప్రభావం అధికంగా ఉంది. డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా దాదాపు 2.41 లక్షల మంది లబ్ధి పొందారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత నియోజకవర్గంలోని వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రూ.2,100 కోట్లు అందించడం విశేషం.

**ఎన్నికల ప్రచారంలో బ్రహ్మరథం**

నియోజకవర్గంలో దాదాపు మూడు నెలల పాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 334 గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ప్రజలు ఈరలక్కప్పకు బ్రహ్మరథం పట్టారు. ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రచారంలో ఆయన ప్రజలకు గట్టిగా వినిపించారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పేదవాడి గెలుపు కోసం సమిష్టిగా పని చేశారు. పేదలందరూ ఉపాధి కూలి ఈరలక్కప్పకు మద్దతుగా నిలిచారు.

**కలిసొస్తున్న స్థానికత...**

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప పేదవాడు. ప్రస్తుతం కూడా పక్కా గృహంలో నివాసం ఉంటున్నారు. తల్లితో కలిసి జీవనం సాగిస్తున్నారు. మంచితనానికి మారు పేరు. మంచి వ్యక్తిత్వం ఉన్న ఈరలక్కప్ప గెలిపించడానికి ప్రజలు నియోజకవర్గ వ్యాప్తంగా ఏకమయ్యారు. ఇదిలా ఉండగా ఈరలక్కప్ప పక్కా లోకల్ కావడం కూడా ఆయన గెలుపునకు దోహదం చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత స్థానికంగానే ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారనే నమ్మకం ప్రజల్లో ఎక్కువగా ఉంది.

**సర్పంచుగా మంచిపేరు**

ఈరలక్కప్ప 2006 నుంచి 2011 వరకూ గుడిబండ మేజర్ పంచాయతీ సర్పంచుగా పని చేశారు. సర్పంచుగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఐదేళ్ల పాటు సర్పంచుగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేశారు. మంచితనంతో పాటు మచ్చలేని ప్రజాప్రతినిధుగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే సర్పంచు తరహాలోనే సేవ చేస్తారనే ఆశను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశం ఆయన గెలుపుకు ఎంతగానో ఉపయోగపడనుంది.

**అర్జీలు రాసిస్తూ పేదలకు అండగా...**


ఈరలక్కప్ప పేదలకు అనేక రకాలుగా సేవ చేశారు. ముఖ్యంగా గుడిబండలోని ప్రభుత్వ కార్యాలయాలకు సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే పేదలకు అర్జీలు రాసిస్తూ సేవలందించారు. పైసా ఆశించకుండా ఉచితంగా అర్జీలు రాసిస్తూ ఆరోజే పేదల పక్షాన నిలబడిన వ్యక్తిగా ఈరలక్కప్ప పేరుతెచ్చుకున్నారు.

**ఈరలక్కప్ప గెలుపు నల్లేరు మీద నడకే..**

నియోజకవర్గంలో ఈరలక్కప్ప గెలుపు నల్లేరుమీద నడకేనని రాజకీయ పండితులు భావిస్తున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నమ్మకానికి పెట్టింది పేరు. చెప్పింది కచ్చితంగా చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఉంది. ఇదిలా ఉండగా మడకశిర నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరు. ఈరలక్కప్ప చాలా సామ్యుడు. ఆయన ఎమ్మెల్యే అయితే మడకశిర ప్రాంతం ప్రశాంతంగా ఉంటుందనే భావన ప్రజల్లో ఉంది. అయితే టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు నాన్ లోకల్. ఆయనపై 54 వరకూ కేసులు ఉన్నాయి. ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రశాంత వాతావరణం దెబ్బతింటుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈరలక్కప్ప గెలుపు లాంఛనమేనని అంటున్నారు.

**మడకశిర నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు ఇలా...**

| మండలం | పురుషులు | మహిళలు |
|---|---|---|
| మడకశిర | 31,642 | 31,998 |
| అమరాపురం | 23,440 | 23,427 |
| గుడిబండ | 21,610 | 21,344 |
| రొళ్ల | 15,504 | 14,932 |
| అగళి | 13,564 | 13,342 |
| మొత్తం ఓటర్లు | 1,05,760 | 1,05,043 |



ఈరలక్కప్ప

## టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



మడకశిర: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం



చిలమత్తూరు: వేణురెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

**మడకశిరరూరల్:** మండల పరిధిలోని సీ కొడిగేపల్లి, చెందకచెర్లు గ్రామాలకు 8 కుటుంబాలు టీడీపీని వీడి ఆదివారం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎన్ రవిశేఖర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తిమ్మప్ప, జయరామప్ప, వాలేనాయక్, శివప్పతో పాటు పలువురికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు హనుమంతరెడ్డి, రాష్ట్ర యువజన కమిటీ సభ్యులు సురేష్‌రెడ్డి, సర్పంచ్ కవిత, నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు:** మండలంలోని సోమఘట్టకు చెందిన టీడీపీ నాయకులు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. హిందూపురం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని నివాసంలో జయరామప్ప, సోమశేఖర్, శ్రీరాములు, మూర్తి, కిషోర్ తదితరులు నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక గెలుపు కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్సర్ అహ్మద్, అమరనాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మడకశిరరూరల్:** మండల పరిధిలోని వైబీ హళ్లి పంచాయతీకి చెందిన సుధాకర్, నరసమ్మ, కదురప్ప, హనుమంతరాయుడు, గోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిటీ సభ్యులు శ్రీరాములు, దశనాథరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సామగ్రి తరలింపు



ఎంజీఎం మైదానంలో పోలింగ్ సామగ్రి తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

**హిందూపురం అర్బన్:** హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని ఎంజీఎం హైస్కూల్లో ఆదివారం ఎన్నికల సామగ్రిని ఎన్నికల అధికారులు ఆయా పోలింగ్ స్టేషన్‌లకు కేటాయించిన అధికారులకు అందజేశారు. నియోజక వర్గ వ్యాప్తంగా 253 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 44 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 209 పోలింగ్ కేంద్రాలున్నాయి. 161 పోలింగ్ కేంద్రాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ అభిషేక్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,49,174 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 1,24,425 మంది, పురుషులు 1,24,730 మంది, ఇతరులు 18 మంది ఉన్నారు. వీరంతా సక్రమంగా ఓటు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

## కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో పోలీసులు

**హిందూపురం అర్బన్:** కర్ణాటక నుంచి హిందూపురానికి ఆదివారం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం (టెట్రా ప్యాకెట్లు)ను సెబ్ పోలీసులు పట్టుకున్నారు. సెబ్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా పోచనపల్లి వద్ద లక్ష్మీపురం గ్రామానికి చెందిన హరీష్‌కుమార్ అనే వ్యక్తి ఒక బ్యాగులో 5 బాక్సులు (480 ప్యాకెట్లు)పట్టుకొని సీజ్ చేశారు. హరీష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. అలాగే నింకంపల్లి బ్రిడ్జి వద్ద మరో వ్యక్తి ద్విచక్ర వాహనంలో 2 బాక్సుల్లో తరలిస్తున్న మద్యాన్ని (144 ప్యాకెట్లు) సీజ్ చేశారు. పట్టణంలోని మేళాపురానికి చెందిన గోవిందప్ప అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు రామ్ ప్రసాద్, కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి



మడకశిరలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది

- మడకశిరలో 241 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ
- ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**మడకశిర:** నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం పార్లమెంట్, అసెంబ్లీకి ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉదయం 7 నుంచి సాయంకాలం 6 గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. నియోజకవర్గంలో మొత్తం 241 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 5 మండలాల పరిధిలో మొత్తం 2,10,804 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 1,05,043, పురుషులు 1,05760 మంది ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటరు ఒకరే ఉన్నారు.

**ఎన్నికల సామాగ్రి పంపిణీ**

పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం నుంచి ఆదివారం ఎన్నికల సిబ్బందికి ఆర్ఓ గౌరీశంకర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఎన్నికల సామాగ్రిని తీసుకుని ఎన్నికల సిబ్బంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు.

**పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు**

కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం మడకశిరలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని కోరారు.



ఎన్నికల బందోబస్తుకు నియమించిన పోలీసులు

**పోలీసులకు పలు సూచనలు**

నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్‌కు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.144 సెక్షన్ అమలు చేస్తున్నారు. బందోబస్తులో పాల్గొనే పోలీసులకు దిశ డీఎస్పీ శ్రీనివాసరావు పలు సూచనలు చేశారు. ప్రశాంతంగా ఎన్నికలను పూర్తి చేయడానికి కష్టపడి పని చేయాలని కోరారు. నిబంధనలు పాటించి ప్రశాంతంగా పోలింగ్ జరిగే విధంగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక రూరల్, అర్బన్ సీఐలు రాజ్‌కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

**అమరాపురం:** మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్ఐ.జనార్ధననాయుడు తెలిపారు. సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని మద్దనకుంట, అమరాపురం, తమ్మడేపల్లి గ్రామాలు సమస్యాత్మక గ్రామాలుగా ఉన్నాయన్నారు. ఈ గ్రామాల్లో పోలీసు బలగాలను మోహరించామన్నారు. మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వివిధ పార్టీ నాయకులు, ప్రజలు తమకు సహకారం అందించాలన్నారు. మండల ప్రజల సహకారంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

**లేపాక్షి:** ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సోమవారం వ్యవసాయ రైతులకు, విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ వేళల్లో మార్పు చేసినట్లు ఏఈ వెంకటేశులు తెలిపారు. ఆదివారం రాత్రి 12 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 3 ఫేస్ సప్లయ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సింగిల్ ఫేస్ సప్లయ్ ఉంటుందన్నారు. అయితే ఎన్నికల రోజున ఎలాంటి ఇబ్బందులు లేకుండా సింగిల్ ఫేస్ కరెంటు ఇస్తున్నామని, రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.